# వ్యక్తిగత ఆరోపణలు చేయుటకు సంబంధించిన కార్య విధానము

## (రూల్ 320)

(i) ఒక సభ్యుడు సభలో ప్రసంగించునపుడు మరొక సభ్యునిపై, సభలో ఆ సభ్యుని ప్రవర్తనను గూర్చి తప్ప, ఎట్టి వ్యక్తిగతమైన దోషారోపణ చేయరాదు.

(ii) సభ్యుడు, సభాపతికి మరియు సంబంధిత మంత్రికి కూడా తగినంత ముందుగా నోటీసు యిచ్చిన తరువాత తప్ప, ఏ వ్యక్తిపైన కూడా అపకీర్తికర లేదా నేరారోపణ స్వభావముగల ఎట్టి ఆరోపణలు చేయరాదు. ముందుగా నోటీసు యివ్వడంవల్ల మంత్రి ప్రత్యుత్తరమివ్వడానికై ఆరోపణలను గూర్చి దర్యాప్తు చేయడానికి వీలు కలుగుతుంది.

(iii) అట్టి ఆరోపణ సభగౌరవమును కించపరచు నట్టిదనిగాని లేదా అట్టి ఆరోపణలు చేయుట వలన ఎటువంటి ప్రజాహితము ఒనగూడదని గాని సభాపతి అభిప్రాయపడినచో ఆయన ఏ సభ్యునినైనను, ఎప్పుడైననూ అట్టి ఆరోపణలు చేయకుండా నిషేధించవచ్చును.

(iv) సభ్యులు సభలో ఏమి చెప్పినా దానినిగూర్చి ఏ న్యాయస్థానంలోను అభియోగం చేయడానికి వీలు లేదు. కాబట్టి మరొక సభ్యునిపై గానీ, మంత్రిపైగానీ, ఆరోపణలు చేయదలచినపుడు, సభ్యుని ప్రయోజనానికి సంబంధించి సభలో సవాలు చేయు అవకాశముండును గాన, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలను ఆ సరిచూసుకొని వాటిని నిరూపించుటకు తగిన ఋజువులున్ననే తప్ప, ఆరోపణలు చేయరాదు. సభ్యులు తాము విన్న సమాచారంపైనగాని, కేవలం పత్రికా వార్తలపైన గానీ ఆధారపడి వాటి ఋజుత్వమును గూర్చి తాము సంతృప్తి చెందితేనే తప్ప, ఆరోపణ చేయరాదు.

(v) విచారణ చేసిన మీదట ఆరోపణలకు ఆధారమున్నదని నమ్మి దానికి బాధ్యత వహించుటకు సిద్ధపడినచో సభ్యుడు, ఆరోపణల వివరములను, వాటికి సంబంధించిన పత్రములేవైనా ఉన్నచో వాటతో పాటుగా, తాను ఆరోపణలను చేయదలచిన రోజున, ఆరోజు సమావేశ ప్రారంభమున సభాపతికి, సంబంధిత మంత్రికి లిఖిత పూర్వకంగా నోటీసు నీయవలెను. ఒకవేళ ఆరోపణలకు ఋజువు సభ్యుని స్వీయ పరిజ్ఞాన పరిధిలో నిదైతే, ఆ విషయాన్ని ఆయన స్వయంగా సభాపతికి వివరించవచ్చును. మరొక సభ్యునిపై ఆరోపణలను చేయదలచినట్లయితే, సంబంధిత సభ్యునికి కూడా నోటీసునీయవలెను. ఆరోపణల వివరముల, పత్రాధార సాక్ష్యములు మున్నగునవి అందజేయకుండా కేవలం ఆరోపణలను చేయు ఉద్దేశ్యమును సభ్యుడు తెలియ జేసినట్లయితే ఆయనను ఆరోపణలను చేయుటకు అనుమతించక పోవచ్చును. తనను తాను సమర్థించుకొనుటకు సభలో లేని వ్యక్తులపై సభ్యులు ఆరోపణలను చేయరాదు. సభ్యులు సభలో స్థిరపడిన

ఆచారాలను పాటించకుండా లేదా సభాపతి అనుమతి పొందకుండా తీవ్రమైన ఆరోపణలు చేయడానికి పట్టుపట్టినచో, అట్టి ఆరోపణలు చేయకుండా సభాపతి నిషేధించ వచ్చును. అంతేకాకుండా అవి శాసనసభా కార్యకలాపములో చోటు చేసుకొనవని రూలింగు నీయవచ్చును.

**ముందు పేర్కొన్న అంశాల దృష్ట్యా ఆరోపణలను చేయుటకు ముందు, సంబంధిత సభ్యుడు ఈ క్రింది విషయాలను తప్పనిసరిగా పాటించాలి.**

1. సభాపతికి, సంబంధిత మంత్రికి తగినంత కు నోటీసును ఇవ్వాలి.
2. ఒకవేళ మరొక సభ్యుని పై ఆరోపణలను చేయదలచినట్లయితే, ఎవరిపై ఆరోపణలను చేయదలిచారో ఆ సభ్యునికి కూడా నోటీసును ఇవ్వాలి.
3. చేయగోరిన దోషారోపణల / ఆరోపణల వివరాలను వాటిని సమర్థించు పత్రములను లేదా ఇతర సాక్ష్యములను చేర్చి నోటీసులో పొందు పరచవలెను.
4. ఆరోపణలకు సంబంధించిన బాధ్యతను లో అంగీకరించుటకు సభ్యుడు సన్నద్ధుడుగా ఉండాలి.
5. ఆరోపణలను నిరూపించడానికి సభ్యుడు సన్నద్ధుడుగా ఉండాలి.
6. ఆరోపణలను చేయడానికి తగిన ఆధారమున్నదని సభ్యుడు తనకు తాను సంతృప్తి చెందాలి.



# 24

## ఆంధ్రప్రదేశ్
## శాసన సభ కార్య విధానం
## సంపుటి

## వ్యక్తిగత ఆరోపణలు చేయుటకు సంబంధించిన కార్య విధానము




ఆంధ్రప్రదేశ్ శాసన మండలి
సచివాలయం, వెలగపూడి, అమరావతి.